


# నీలంగళ్ళ దుప్పటి

కావిలిపాటి విజయలక్ష్మి

నన్ను చూస్తూనే చిరునవ్వుతో విష్ చేసాడు అయ్యరు. నేను ఎప్పుడు ఆ టౌను కెళ్ళినా, ఆ హోటల్లోనే బసచేస్తాను. గదులు నీట్ గా ఉంటాయి. సప్లయి బాగుంటుంది. అయ్యరు రిజర్వ్డ్‌గా ఉంటాడు. ఆడవాళ్ళకి ఆ హోటలు గదుల్లో ప్రవేశ ముండదు అదీ ఆ హోటలుకున్న ప్రత్యేకత.

అయ్యరు నాకు పరిచయస్థుడే ఫర్వాలేదనుకొని, ఓసారి మా ఆవిడ్ని తీసుకుని వచ్చాను. నా పక్కనున్న మా ఆవిణ్ణి చూసి, "మీకు తెలియదా సార్," అని మరో హోటలు అడ్రసు చెప్పి, "బాగుంటుంది. కావాలంటే నేను మేనేజరుకి ఫోన్‌చేసి చెబుతాను వెళ్ళండి," అని లౌక్యంగా, నాకు ఉద్వాసన చెప్పాడు.

బోయ్‌ని పిలిచి తాళంచెవులిస్తూ, రూమ్ నంబర్ చెప్పి, ''అయ్యగారి కేం కావాలో చూడు'' అన్నాడు.

బోయ్ కొత్తకుర్రాడు. పచ్చగా, అందంగా, బాగా బ్రతికిన కుటుంబంలోని అబ్బాయిలా కనిపించాడు. ఇదివరకైతే సత్యం అనేవాడుండేవాడు. నల్లగా మోటుగా నవ్వుతూ, నేను అడిగినా అడగకపోయినా, ఆ వూర్లో రిలీజయిన కొత్త సినిమాల గురించీ, తన ఉద్యోగం గురించీ గలగలా మాట్లాడేవాడు. ఈ అబ్బాయి కాస్త రిజర్వ్‌డ్‌గా కనిపించాడు.

రూమ్ తలుపు తెరిచి లైట్ స్విచ్ ఫాన్ స్విచ్ ఆన్‌చేసి, పక్కమీద దుప్పటి మార్చి, దిండు కవరు మారుస్తూ, "కాఫీ, సిగరెట్టు ఏమన్నా తెమ్మన్నారా సార్," అని అడిగాడు వినయంగా.

"నీ పేరు ? నువు కొత్తగా చేరావా పనిలో" అడిగాను అతని ప్రశ్నను పక్కకునెట్టి.

"అవునండి." పొడిగాజవాబిచ్చాడు.

ఇదివరకు సత్యం అనేవాడుండేవాడు. అన్నాను స్వగతంలా.

అతను మాట్లాడలేదు.

రెండు నిమిషాల తర్వాత "మీకేమన్నా కావాలాంటే..." అని నావైపు చూశాడు.

"ఆ, పిలుస్తాలె" అనేశాను. అతని మాట మధ్యలో.

వెళ్ళిపోయాడు బయటికి.

కుర్రాడు బాగున్నాడు. ఎఱ్ఱగా. అరె! పేరేమిటో చెప్పనేలేదు అనుకున్నాను. మళ్ళీ అడగొచ్చులే అనుకొని, బట్టలు మార్చుకొని. కాలకృత్యాలు తీర్చుకొని స్నానంచేసి. ఆఫీసుకి వెళ్ళటానికి తయారయి, డ్రస్సింగ్ టేబుల్ దిగువున అమర్చిన బటన్ నొక్కాను.

రెండు నిమిషాలు గడిచాక తలుపు మీద కటకట శబ్దం. తలుపు తెరుచుకున్నాక అనుకున్నాను గడియ పెట్టడం మరిచిపోయానని.

"ఆఁ. రావోయ్," అన్నాను.

అతను లోపలికి వస్తూ, "ఏంకావాలి సార్" అడిగాడు. "ఒక కాఫీ, ఓ ప్లేటు ఇడ్లీ పట్రా" అన్నాను.

ఐదారు నిముషాల్లో తెచ్చాడు. అతను బయటికి వెళ్ళబోతుంటే జేబులో డబ్బులు తీసి, సిగరెట్టుపెట్టె తెమ్మని చెప్పాను పిల్చి.

అతను సిగరెట్టుపెట్టె తేవటం కొద్దిగా ఆలస్యం చేసాడు. "ఏమిటి ఇంతసేపు చేశావ్ ?" వాచ్ చూసుకుంటూ కొంచెం విసుగ్గా అడిగాను.

"మన హోటలుముందు కొట్టు ఇవాళ బంద్ సార్. రోడ్డు చివరకు వెళ్ళాను" అన్నాడా అబ్బాయి తలవంచి నిల్చుని. అతని వయసు పందొమ్మిదీ ఇరవై మధ్య ఉంటుంది. అతనివైపే చూస్తున్నాను. అబ్బాయి ముద్దుగా అందంగా ఉన్నాడు. అతనీ ఉద్యోగం చెయ్యడానికి తగడనిపిస్తోంది.

''నీ పేరు'' అడిగాను.

"మధుబాబు అని పిలుస్తారండి" అన్నాడు.

''ఎంతవరకు చదివావు ? నా రెండో ప్రశ్న.

చదివాననట్లు తల ఊపాడు.

"ఏం చదివావు ?"

"ఇంటర్ మీడియట్ ప్యాసయ్యానండి." అతని జవాబు.

"పైకి చదవలేదూ! ఈ ఉద్యోగంలో ఎందుకు జాయిన్ అయ్యావు ?" అతని జవాబుకోసం చెవులు రిక్కి-రించాను.

అదోలా నవ్వి, "పై చదువులు చదివే అదృష్టం నాకు లేదు. ఈ నిర్బంధ రిటైర్‌మెంట్ స్కీంలో మా నాన్నగార్ని రిటైర్ చేసారు. ఏం చెయ్యాలి ? ఇల్లు గడవదు. ఉద్యోగంలో చేరాను" అన్నాడు.

"అయ్యేరు జీత మెంతిస్తారు ?" అడిగాను.

చెప్పాడు.

"ప్చ్." పాపం సానుభూతి వ్యక్తం చేసాను.

తర్వాత నేను ప్రశ్నించకుండానే తన కుటుంబ వివరాలు చెప్పాడు. ఆరోగ్యం చెడి మంచాన ఉన్న తల్లి, ఇద్దరు చెల్లెళ్ళు, ఉద్యోగం పోయిన దగ్గరనుంచీ ఇంటిసంగతి పట్టని తండ్రి.

నేను హోటల్లో ఉన్న రెండు రోజులూ, సత్యంలా బోరుకొట్టకుండా చాలా నమ్రతగా తన ఉద్యోగ ధర్మం నిర్వర్తించాడు మధుబాబు అనుకున్నాను.

నేను వెళ్ళటానికి సంచీ సర్దుకుంటున్నాను. మధుబాబు వచ్చాడు. "వెళ్ళిపోతున్నారా సార్," అని అడిగాడు.

"అవునన్నాను."

"మీ రే డిపార్టుమెంట్‌లో పని చేస్తున్నారు సార్ !" అడిగాడు.

చెప్పాను.

"నా కేదన్నా ఉద్యోగం ఇప్పించగలరా సార్" అడిగాడు. అతని కళ్ళు దీనంగా ఉన్నాయ్.

"మళ్ళీ వారం రోజుల్లో వస్తాను. చెబుతాను" అన్నాను.

హోటలివతలివరకూ నా బేగ్ పట్టుకొని నా వెనుక నడిచాడు మధుబాబు.

* * *

మా ఆవిడ ఎందుకో సన్నగా గొణుగుతూ విసుక్కు-ంటోంది. బొత్తిగా ఇల్లూ వాకిలీ పట్టించుకోరు. తన ఉద్యోగం తన క్యాంపులూ, అదే లోకం. డబ్బుతెచ్చి ఇంట్లో పారెయ్యగానే సరా! బాధ్యత తీరిపోయినట్టేనా ? అని.

"ఏమిటయ్యిందిప్పుడు ?" ఆమె ధోరణి వినలేక నేను విసుగ్గా అడిగాను.

"ఎన్నిసార్లు చెప్పాలండీ ! పట్నం వెళ్తుంటారు. మంచివి రెండు దుప్పట్లు తెమ్మని. ఈ వూరి కొట్లల్లో బాగుండవు. పైగా ధరలెక్కు-వ" అంది.

"సర్లె, ఈసారి తెస్తాను" అన్నాను. నిజానికి అదికాదు ఇంకేదో చెబుతుంది. ఆమెకు నాతో మాట్లాడటానికి వీలు చిక్క-దు. పిల్లలు ఇంట్లో తిరుగుతూంటే డబ్బు విషయం ఇంకా ఏమన్నా మాట్లాడటం, ఆమెకు ఇష్టం ఉండదు. ఒక్కొసారి ఆమె వంటఇంటి పనులు తెముల్చుకుని వచ్చేసరికి రాత్రి నేను నిద్రపోతాను. నన్ను లేపి చెబితే నా మూడ్ సరిగ్గా ఉండదని, అప్పుడు చెప్పదు. నేను ఇంట్లో ఉండేది నెలకు పదిరోజులు. ఆ పది రోజులూ ఆఫీసు ఉండనే ఉంటుంది.

రెండు నిమిషాలు ఏదో ఆ పనీ ఈపనీ చేస్తున్నట్లు నటించి, "మా అమ్మ ఉత్తరం వ్రాసింది" అంది.

"ఏమిటి విశేషాలు ? అంతా క్షేమమేనా" అన్నాను.

"మా శంకరుగాడికి ఏదన్నా ఉద్యోగం చూడమని మీకు చెప్పమని వ్రాసింది," అని నా ముఖంలోకి చూసింది మా ఆవిడ.

"హాయిగా వ్యవసాయంచేసుకోమను. భూములున్నాయి కదా ! పండించుకుంటే దర్జాగా బతగ్గలరు వాళ్ళు. ఉన్నవాడూ, లేనివాడూ ఉద్యోగానికి ఎగబడితే ఇంక ఈ దేశంలో నిరుద్యోగ సమస్య పరిష్కా-రం కాదు." అన్నాను.

"మా తమ్ముడొక్క-డు మానేసినంత మాత్రాన పరిష్కా-ర మైపోదులెండి నిరుద్యోగ సమస్య ! వ్యవసాయం చేయించలేకనే కదా, ఉద్యోగాని కెగబడత ! వాడికి మాత్రం మీలా ఉద్యోగంచేస్తూ దర్జాగా బ్రతకాలని ఉండదూ !" అని ముఖం ముడుచుకుంది.

ఇంట్లో ఉన్న రెండు మూడు రోజులూ, ఆమెతో అనవసరంగా తగవు తెచ్చుకొని మనస్సు పాడుచేసుకోవటం అవివేక మనిపించింది. "ఐతే వ్రాయి. అప్లికేషను పంపించమని" ఏదో సలహా చెప్పాను. ''అతనికి నచ్చకపోతే - అలాగే ప్రయత్నిద్దాం.'' అన్నాను.

"మీరు వ్రాయండీ అమ్మ సంతోషిస్తుంది" అందామె. "అలాగేలే నువ్వు వ్రాయి" అన్నాను. రెండు వారాల్లో మా ఆఫీసులో గుమస్తా పోస్టులకు ఇంటర్వ్యూ లున్నాయ్. మధుబాబుకే వేయించాలని అనుకొంటున్నాను. మా బావమరిదీ అదే క్వాలిఫికేషను అయినా అతనేదో పెద్ద ఆఫీసరు ఉద్యోగం చెయ్యాలనుకుంటుంది మా అత్తగారు.

ఆ రాత్రి మా ఆవిడకి మధుబాబు విషయం చెప్పి, "చూడు,పాపం అలాటి వాళ్ళు ఏంతోమంది ఉన్నారు మన దేశంలో" అన్నాను.

"అతని తండ్రికి ఎందుకు ఉద్యోగం తీసేశారు ?" అడిగిందామె

"వ్యక్తిగత ద్వేషాలంటాడు మధుబాబు" అన్నాను.

"సర్లెండి. ఈసారి మొదలు తమ్ముడికి వేయించండి. లేకపోతె అమ్మ

మనసు కష్టపెట్టుకుంటుంది. తర్వాత మీ మధుబాబుకే చూద్దురుగాని." అంది.

నవ్వుకున్నాను. మధుబాబు విషయం విని జాలిపడింది కాని, స్వార్థత్యాగం చెయ్యలేకపోయింది అని.

* * *

నవ్వుతూ నాకు నమస్కరించి నా చేతిలో బేగ్ అందుకున్నాడు మధుబాబు. రూమ్‌లోకి వెళ్ళాక వేడినీళ్ళు తెస్తాను స్నానం చెయ్యండి సార్ అన్నాడు. జిడ్డుముఖం నేనూ, చిరాగ్గా ఉండటం గమనించాడు కాబోలు.

"ముందు స్ట్రాంగ్ కాఫీ పట్రా." అన్నాను. ఐదు నిమిషాల్లో కాఫీ గ్లాసుతో ప్రత్యక్షమయ్యాడు మధుబాబు.

''రాత్రి మీల్సు తీసుకుంటారా ? చపాతీలా ?" అడిగాడు మధుబాబు. సాధారణంగా నేను ఆ హోటల్లో ఉన్నప్పుడు రాత్రిపూట చపాతిలే తీసుకుంటాను. అయ్యరు తమ ఇంట్లో చేయించిన చపాతీలు ప్రత్యేకంగా నాకు పంపిస్తాడు. ఆ హోటలు పక్కదే అయ్యరు మేడ. అందులో అతని కుటుంబముంది.

అయ్యరు ఇంట్లో తయారుచేసిన చపాతీలూ, కూరా చాలా రుచిగా ఉంటాయి. అయ్యరు నాకోసం స్పెషల్‌గా అలా చేయిస్తాడో, లేక వాళ్ళింట్లో అలా చేసుకుంటారో నాకు తెలియదు.

"మేనేజరుగారికి చెప్పు. మూర్తిగారు చపాతీ పంపించమన్నారు." అని చెప్పాను మధుబాబుకి.

అలాగే అని పక్క దుప్పటీ, దిండు గలీబూ మార్చి, కాళీ గ్లాసు పట్టుకొని వెళ్ళిపోయాడు మధుబాబు.

తర్వాత గదులు ఊడ్చే మనిషి ఎనభైనాలుగోనంబరు గదికి వేడినీళ్ళివ్వమన్నాడు మధుబాబు ! ఇదే కదండీ ! అని అడిగింది కొంచెం తెరచి ఉన్న తలుపులోంచి లోపలికి చూస్తూ.

"ఆ తీసుకురా" అన్నాను.

స్నానంచేసి ఫాన్ స్విచ్ ఆన్‌చేసి కుర్చీలో కూర్చుని పేపరు చూస్తున్నాను.

రాత్రి ఎనిమిది దాటింది. చపాతీలు తెచ్చి టీపాయ్‌మీద పెట్టాడు మధుబాబు. కూజాలోని నీళ్ళు గాజు గ్లాసులోకి వంచి తెచ్చి పక్కన పెట్టాడు.

"సార్ ! కాఫీ, పాలా, బోర్నవిటా ! ఏమిటి కావాలి ?'' అడిగాడు.

''బోర్నవిటా పట్టుకురా!'' అన్నాను.

మళ్ళీ బోర్నవిటా తెచ్చి ఇచ్చి వెళ్ళిపోయాడు మధుబాబు.

రెండు రోజులున్నాను హోటల్లో. కాని మధుబాబు ఉద్యోగం సంగతి ప్రస్తావించలేదు.

మళ్ళీ వారం ఆఊరు వెళ్ళినప్పుడు నేనే అడిగాను. నీకు ఎక్కడన్నా ఉద్యోగం దొరకబోతుందా ? ఉద్యోగ ప్రసక్తి ఎత్తడం మానేశావే అని.

నవ్వి "నాబోటివాడికి ఉద్యోగం అంత తేలిగ్గా దొరుకుతుందా సార్! మీకు అవకాశముంటే మీరే చెబుతారు. ఎవరి మీదన్నా వత్తిడి తేవటం, పదిసార్లు అడిగి వేధించటం నాకు ఇష్టం కాదు. నేను ఉద్యోగమని మిమ్మల్ని ప్రెస్ చేస్తూంటే మీరీ హోటలుకే రావటానికి భయపడతారు" అని పెదవులు కదిలీ కదలనట్టు నవ్వాడు మధుబాబు.

మా ఆఫీసు పేరు చెప్పి, "ఫలాన రోజు పేపర్లో ప్రకటన పడింది చూడు ఎంప్లాయ్‌మెంట్ ఎక్చేంజి ద్వారా నీ పేరుపచ్చేలా చూడు. ఇంటర్వ్యూకు రా. తర్వాత నేను ప్రయత్నిస్తాను" అని చెప్పాను

'' ఎంప్లాయ్‌మెంట్ ఎక్సేంజా ! అని ఆశకుడిలా నవ్వి ప్రయత్నిస్తాలెండి" అన్నాడు.

కాని, మధుబాబు పేరు రాలేదు నాకు తెల్సు, అది చాలా పెద్ద తతంగమని.

* * *

మధుబాబు కొంచం చిక్కి నల్లబడ్డట్టు కనుపించాడు. నా బెడ్‌మీద పక్క పరుస్తూన్న అతనివైపు చూస్తూ ''ఏం అలా ఉన్నావ్ ! ఆరోగ్యం బాగో లేదా !" అడిగాను

''బాగానే ఉన్నానండి '' అని నవ్వబోయాడు.

''ఇంటర్వ్యూకి రాలేదు. నువ్వు ప్రయత్నించలేదా ? ఎంప్లాయ్‌మెంటు ఎక్చేంజిలో మీ ఫాదర్‌ని చెప్పమనక పోయావా ?" అన్నాను.

''మా ఫాదర్ ఇల్లు వదిలి రెండు నెలలయిందండి అమ్మ మంచం పట్టింది" అన్నాడు మధుబాబు. జాలిగా చూశా నతనివైపు.

''అరె, పాపం. పోనీ మరేదన్నా రెండొందలు జీతం వచ్చే ఉద్యోగమన్నా చూస్తానుండు" అన్నాను, అతనివైపు సానుభూతిగా చూస్తూ.

ఇదివరకటి సత్యం ఐతే సిగరెట్ పెట్టె తెచ్చి తిరిగి చిల్లర ఇచ్చేవాడు కాదు. నేను అడిగేవాణ్ణీ కాదు. మొట్ట మొదటిసారి అతను సిగరెట్టు పెట్టె తెచ్చి చిల్లర ఇవ్వబోతే ఉంచు అన్నాను. అది మొదలు అతను ఇవ్వడం మానేశాడు. నేను రూమ్ ఖాళీ చేసి వెళ్ళిపోయేటప్పుడు ఇచ్చిన డబ్బులు వద్దనకుండా తీసుకునేవాడు ఒకవేళ తొందరలో నేను ఇవ్వటం మరచిపోతే ఇవ్వాళ సినిమా చూడాలనుకుంటున్నానండీ! అనో మరోమాట అనో లౌక్యంగా గుర్తుచేసేవాడు.

కాని మధుబాబు డబ్బులు ఉంచవోయ్ అంటే, వద్దండీ అని టేబలు మీదుంచి, మరి నిల్చోకుండా వెళ్ళిపోతున్నాడు. వెళ్ళిపోయే రోజు రూపాయి అర్ధా ఇవ్వబోతే సిగ్గుపడిపోయి అలా ఇటుపైన ఇవ్వకండి సార్. మీరు డబ్బివ్వబోతూంటె మా నాన్న ఆఫీసర్‌గా పని వాళ్ళ చేతుల్లో డబ్బు లుంచటం గుర్తు




వస్తోంది అన్నాడు. నేను మధుబాబు పనిలోకి వచ్చిన తర్వాత రెండవసారి హొటలుకి వచ్చినప్పుడు.

"థ్యాంక్యూసర్" అని బరువుగా నిట్టూర్చాడు మధుబాబు.

మరురోజు నాకు వళ్ళు తెలియని జ్వరం వచ్చింది. ఏవో టాబిలెట్సు కొని తెచ్చి ఇచ్చి "డాక్టరు దగ్గరకు వెళ్దామా సార్" అని అడిగాడు.

"వద్దులే తగ్గిపోతుంది. ఇంటికి వెళ్ళిపోతాను" అన్నాను.

అబ్బా అమ్మా అని నేను బాధపడుతూంటే "తలనొప్పాసార్" అని తలపట్టబోయాడు. వద్దని వారించాను.

"ఫర్వాలేదు, మా ఫాదర్ లాటివారు" అని దిగువ కెళ్ళి ఎవర్నో అడిగి తెచ్చి అమృతాంజనం వ్రాసి తలపట్టాడు.

కొంచం సేపటికి నాకు నిద్ర పట్టింది. మధుబాబు ఎప్పుడు నా గదిలోంచి వెళ్ళిపోయాడో నాకు తెలియదు. తెల్లవారి ఐదు గంటలకి తెలివొచ్చింది

మ రో అరగంటలో బస్సుంది. ఆదరా బాదరా బట్టలు బేగ్ లో కూరి రూం తాళం, విభూదిరేఖలు ముఖాన్ని దిద్దుకుని కుర్చీలో కూర్చున్న అయ్యర్ కిచ్చి, అతను జ్వరం తగ్గిందా అనే ప్రశ్నకు పొడిగా జవాబిచ్చి రోడ్డుమీద పడ్డాను.

హొటలుకి వస్తూ మధుబాబు ఎదురై నమస్కరించాడు. వెళ్ళిపోతున్నారా సార్ అని నా చేతిలో బేగ్ అందుకొని రిక్షా పిల్చాడు.

రిక్షాలో కూర్చుంటూ పర్సు జేబులోంచి తియ్యబోయి మళ్ళీ మానేశాను.

* * *

నాకు తెలిసిన ఒక పెద్ద కాంట్రాక్టరుతో మాట్లాడి మధుబాబుని మేస్త్రీగా, రెండు వందలరూపాయల జీతం ఇస్తూ, వేసుకోవటానికి వొప్పించా నతన్ని.

కాని మళ్ళీ ఆ ఊరు వెళ్ళటానికి పదిహేనురోజుల వరకూ పడలేదు. మామూలుగా నన్ను చూస్తూ అయ్యర్ చిరునవ్వుతో విష్ చేసి 'సత్యం' అని పిల్చాడు బోయ్‌ని.

'మధుబాబు ?...'అన్నాను అయ్యరు వైపు చూస్తూ.

"దొంగ రాస్కెల్... ఉద్యోగంలోంచి పోమన్నాను. ఈ రోజుల్లో అందరినీ నమ్మకూడదు సార్" అన్నాడు.

సత్యం నా బేగ్ పట్టుకొని ముందుకి నడుస్తూంటే 'మధుబాబు దొంగవాడా ? ఏం చేశాడో తెలుసుకోవాలనే ఆత్రతలో అతన్ని అనుసరించాను.

సత్యం పక్కమీద దుప్పటి తీస్తూంటే అడిగాను, మధుబాబుని ఎందుకు ఉద్యోగంలోంచి తీశేసారని ?

దొంగోడు కొడుకు దొంగోడు కాక మరేటవుతాడు బాబూ ? అళ్ళ నాన్న

లంచాలు తినేవాడని, ఇలాటి ఎదవ పనులు చేసేవాడనే ఉద్యోగం పీకేశారు. పోనీ కుఱ్ఱోడు మంచోడిలా కనిపిస్తున్నాడని మా మేనేజరుగారు నన్ను హోటల్లోకి మార్చి నా పని మధుబాబుకి ఏశారండి.

"ఇంతకీ ఏంచేశాడు?" అతని మాట పూర్తి కాకుండా విసుగ్గా ప్రశ్నించాను.

"దుప్పటిఇంటికిపట్టుకుపోయాడండి. సరిగ్గా పదిహేనురోజుల క్రిందటండి. మేనేజరుగారు క్రొత్తవి నీలం గళ్ళవి ఇరవై దుప్పట్లు హైకోప్యాక్టరీ నుంచి తెప్పించారండి.

''అందులో ఒక దుప్పటి తక్కువొచ్చిందండి. లెక్క చూస్తే ఈ మేడ మీది గదులన్నీ, మధుబాబే గదండీ సప్లయి చేస్త. మరెవరు తీస్తారు ?'' అన్నాడు సత్యం.

"ఏమో ! అలాటి కుర్రాడిలా కనుపించడు" అన్నాను

"ఆడు మా గొప్ప డాకండి. స్టేషన్లో పెట్టించి చితగ్గొట్టినా చెప్పలేదండి దుప్పటి పట్టుకుపోయానని" అన్నాడు సత్యం.

" స్టేషన్లో పెట్టి కొట్టించారా ? '' అన్నాను సహించలేనట్లు.

"ఆ మరేటి చేస్తారండి ? స్టేషన్లో వదిలాక ఆదే వెళ్ళిపోవటం మరి కనపడ లేదండి" అన్నాడు సత్యం.

"అంటే ? '' ఎటు వెళిపోయ్యాడు కలవరంగా అడిగాను.

"ఏమోనండి ! ఆత్రతతో చెల్లెలు వచ్చిందండి హోటలుకి మా అన్నయ్యేడి అని అడగటానికి. దొంగ ఎదవ ఇంటి కెళ్ళలేదు. ఎటో ఉడాయించాడు" అన్నాడు సత్యం.

నా మనస్సంతా కరాబయిపోయింది. ఎంత ఆలోచించీ మధుబాబు ఇలాటి పని చేసిఉంటాడని సరిపెట్టుకోలేకపోయాను.

* * *

ఇంటికి వచ్చేసరికి మా ఆవిడ చాకలి వాడితో ఘర్షణపడుతూంది. వాడు "నా కొడుకుని చితకతన్నానండి. దుప్పటి రేవులో పారేసినందుకు. ఆడు పౌరుష మొచ్చి పారిపోయాడు ఇంట్లోంచి. కావాలంటే ఖరీదిరుచుకోండి'' అంటున్నాడు.

మా ఆవిడ నా వెనుకే వచ్చి "ఏమండీ ఆ నీ లంగళ్ళ దుప్పటి ఎంతకు కొన్నారు ?" అని అడిగింది.

తెల్లబోతూ నీ లంగళ్ళ దుప్పటా ? అన్నాను.

"ఔనండి ! మీరు క్రితంసారి క్యాంపు నుంచి వచ్చేటప్పుడు తెచ్చారు కదూ ! కాస్త, మాసినట్లనిపిస్తే పీడి కొడుక్కి రేవుకి వేశాను. చూడండి.పోయిందంటున్నాడు," ఫిర్యాదు చేసింది.

ఆ రోజు నేను నీర్సంగా పడుకుండిపోతే మా ఆవిడ బేగ్‌లోని బట్టలు తీసి సవరించింది. నేనే ఆ జ్వరం మైకంలో నీలంగళ్ళ దుప్పటి సంచీలో కూరి ఉంటానా ? నా మతి పోతూంది.

"అదేమిటలా తెల్లబోతారు ? చెప్పండి తొందరగా. ఆ దుప్పటి ఎంతకు కొన్నారు ?" అంది మా అవిడ.

ఎంతకి కొన్నానని చెబుతాను ? ఆ దుప్పటి కథ చెప్పాలా ? వద్దా? నా ఆలోచన తెగకముందే "గుర్తు తెచ్చుకోండి. నీలంగళ్ళది దళసరి దుప్పటి ఎంతకి కొన్నారు ?" మా అవిడ మళ్ళీ ప్రశ్న.

"పోన్లెద్దూ!ఏదో పొరపాటున పారేసి ఉంటాడు. వాడికొడు కింట్లోంచి పారిపోయాడని వాడు అఘోరిస్తూంటే, బొత్తిగా మనసులేనిదానిలా దుప్పటి ఖరీదంటావు.'' కసురుకున్నాను నెమ్మదిగా.

మా ఆవిడ గడుసుది. అప్పుడు నా మూడ్ బాగోలేదని గ్రహించింది."రసీదు ఎక్కడో పెట్టారట. చూసి చెబుతాను మడేలూ. అమ్మా కష్టం, చాలవని అడిగి అర్థా రూపాయి తీసుకుంటే ఫర్వాలేదు కాని ఇలా బట్టలు పోయాయంటే ఎలా ?" అంది అవతలికి వెళ్ళి.

"అలా అనకండమ్మా ! కూటికి చిన్నోళ్ళం కాని గుణానికి కాదమ్మా ! నా కొడుక్కి డొక్కచీల్చి చూసినా దొంగబుద్ధి లేదు. దుప్పటి దాని అమ్మ సిగగొయ్యా ! అని ఆ దుప్పటిని, ఆ దుప్పటి అపహరించినవాడినీ వాడి పరిబాషలో నాలుగు తిట్టి, మావుగాబట్టి, మీరు ఏశారు మేం పారేశాం అని వప్పుకున్నాం. మరోనాటి ఓళ్ళయితే అస్సలు దుప్పటి నాకు రేవులో ఎయ్యలేదు అని దబాయిస్తారు. అంటూ వెళిపోయ్యాడు.

పిల్లలంతా స్కూలుకి పోయాక నేనూ మా ఆవిడా మాత్రమే ఇంట్లో ఉన్నప్పుడు "కాంతం నేనస్సలు దుప్పటి కొనలేదే ! నీలంగళ్ళ దుప్పటి బాబుగారు తెచ్చినది అంటావేమిటి ?" అని అడిగాను మా ఆవిణ్ణి.

"బాగుంది.ఆజ్వరం గాభరాలోమరచి పోయారేమో, కొన్నట్టు గుర్తులేదేమో ! మీ బేగ్‌లోంచి తీశానుగా కొత్త దుప్పటి" అంది కాంతం నవ్వుతూ.

నిప్పురవ్వలా నా గుండెల్లో చేరి బాధిస్తూన్న నిజం మరి దాచలేకపోయాను. నీలంగళ్ళ దుప్పటి పోయిందని మధుబాబుని శిక్షించటం చెప్పి "కాంతం,ఇప్పుడేం చెయ్యాలి.ఆ ఉదయం బస్సు పోతుందనే తొందరలో మంచంమీద చిందరవందరగా పడేసుకున్న నా పంచా తువ్వాలూ, శాలువాతో పాటు ఈ దుప్పటి పెట్టేసి ఉంటాను." అన్నాను బాధగా, నా పనికి నేను నవ్వుకుంటూ.

"అయ్యోపాపం ఎంతపని జరిగిందీ!'' అని నొచ్చుకొని ''ఏంచేస్తాం.మీరు కావాలని ఆ దుప్పటి తేలేదుగా" అంది.

ఈ జరిగినదంతా అయ్యరుకి చెప్పేస్తే అని ఆలోచించాను చాలా రోజులు. కాని చెప్పలేకపోయాను ఎందుకో.

కాని ఎవరన్నా నీలంగళ్ళ దుప్పటి అంటే త్రుళ్ళిపడుతున్నాను.

*      *      •

దీపావళి వెళ్ళిన మరురోజు చాకలి వాడి కొడుకు రమణ నా షర్టు చేత్తో పట్టుకొని గేటు తీసుకుని లోపలికి వస్తు న్నాడు. వీధి వరండాలో నిల్చుని పళ్ళు తోముకుంటూ చూశాను.

వాడు మళ్ళీ తిరిగివచ్చినందుకు సంతోషంగా నవ్వుతూ "ఏరా రమణా ఎప్పుడు రాక?" అని అడిగాను.


వాడు జవాబివ్వకుండానే నా దగ్గరకు వచ్చి, "ఈ షర్ట్ ఖరీదెంత బాబూ ?" అడిగాడు.

"ఏం ? ఏమిటయ్యింది ?" అడిగాను షర్టు వైపు వాడి ముఖంవైపు మార్చి మార్చి చూస్తూ.

"నిన్న సిసింద్రీ ఎలిగి షర్ట్ మీదపడి కాలి చిన్న బొత్త పడింది. నేను నిన్ననే వచ్చాను. రాత్రి నేనే 'సిసింద్రీ' ఎలిగించాను. మా అయ్యకు తెలిస్తే మంచోడు కాదు" అన్నాడు.

"ఇంతకాలం ఎటుపోయావురా !" అని నవ్వి "అలా పొరపాట్లు చెయ్యకూడదురా రమణా" అన్నాను.

వాడు అదోలా నవ్వి, "మంచోడు తెలిసినోడు ఎవడన్నా తెలిసి చేస్తాడేటండి ? పారపాటంటే తెలియక జరిగిపోయిందానికే కదండి పొరపోటంటారు. కలెక్టరవనీండి మినిష్టరవనీండి ఆడమ్మ మొగుడవనీండి పొరపాటు జీవితంలో సెయ్యకుండా ఉంటాడా ? ఆయేళ మీ దుప్పటి నీలంగళ్ళ దుప్పటి రేవుకాడ పోయిందని బజార్లో నన్ను సిత



ప్రమీలా! మన వాడి ఘన కార్యం చూశావా? ఇల్లు మాయం జేశాడు!!!

గొట్టేశాడు మాఅయ్య. ఆ ఎల్లడం ఎల్లడం రాజమండ్రి ఎలిపోయాను. కష్టపడితే కూటికి కరువేటండి ? ఒటెల్లో పనిచేసే ఓణ్ణి.ప్చ్ ఎందుకు! మా అయ్యకి, అమ్మకి నా నొక్కణ్ణి పేపర్లో ప్రకటన ఇవి వొచ్చీసినాను.

"మీ నాన్న పేపర్లో ప్రకటన వేయించాడా ?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఔనండి. ఎర్రెత్తి పోయాడటండి పేపర్లో ప్రకటనంటే సూడండి. ఆడికి తగిన ఖర్చేనా ? ఆ ఏళ దుప్పటి రేవు కాడ..."

అని వాడు అనేంతలో మరివినలేని వాడిలా "సర్లే ఏదోజరిగిపోయింది. వెళ్ళు అన్నాను.

మళ్ళీ అడిగాడు షర్టు ఖరీదెంత అని.

దుప్పటి ఖరీదు వదిలేశాం. షర్టు ఖరీదు కూడా వదిలేస్తే వీడు ఇదే అలవాటుగా బట్టలు పోయాయని అంటాడేమో అనే అనుమానం వచ్చి ఏభై అన్నాను టక్కున.

మా ఇద్దరి మాటలూ వింటూన్న మా మాష్టరుగారు నవ్వుతూ "రమణా! తప్పో పొరపాటో చెయ్యటం మానవలక్షణం. కాని అది ఒప్పుకోవటంలో గొప్పతన ముందిరా. పో మూర్తి గారి షర్టు ఖరీదులో సగం నువ్విచ్చు కోవాలి. ఏమండీ! మూర్తిగారూ ! పెద్ద మనుషుల మనుకునేవారిలో చేసిన తప్పులు మింగేసి బాబుల్లా తిరిగేదెంతమంది లేరు ?" అని నా వైపు చూస్తూ ప్రశ్నించారు.

"నిజమే. ఔను. పోరా రమణా" అని లోపలికి నడిచాను.

తప్పులు మింగేసి బాబుల్లా తిరిగే వారు. నాకు కొరడాతో చెళ్ళున కొట్టి నట్లయింది మాష్టరు గారి మాట.

రమణలానే...ఏ నాటికైనా నేను మధుబాబుని కూడా చూసేలా వరం ఇవ్వు భగవాన్! కనుపించని దేముణ్ణిమనసులోనే ప్రార్థించాను.

